క్లుప్తంగా

శ్రీ మఠంలో ద్వాదశి వేడుకలు


ప్రత్యేక అలంకరణలో మూలబృందావనం

మంత్రాలయం రూరల్ : శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ద్వాదశి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు, కేరళ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు భారీగా తరలిరావడంతో మఠం పరిసరాలు రద్దీగా మారాయి. పీఠాధిపతి శ్రీ సుబుధేంద్రతీర్థుల ఆశీస్సులతో మూలబృందావనానికి వేకువ జాము నుంచి విశేష పూజలు చేపట్టారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు,నవరత్న రథాలపై అధిష్ఠింపజేసి ఊరేగించారు.

గోడ కూలి ముగ్గురికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓంకారి

ఆదోని అర్బన్ : మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో గురువారం గోడ కూలి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఇంటిని కూల్చేసి కొత్తగా నిర్మాణం చేపట్టేందుకు పునాది తవ్వుతుండగా పక్క ఇంటి గోడ ఒక్కసారిగా కూలి పడటంతో ఓంకారి, గర్జప్ప, హుసేన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు వెంటనే ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఇంట్రాస్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ఆదోని అర్బన్ : గుంతకల్‌లోని రైల్వే క్రీడా మైదానంలో బుధవారం జరిగిన ఇంట్రా స్పోర్ట్స్ మీట్‌లో పట్టణంలోని భాష్యం పాఠశాలకు చెందిన 50 మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ మేరకు గురువారం పాఠశాల ప్రిన్సిపాల్ సదాశివ, వైస్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, సీఓ సంగీత, హెచ్‌ఎం వాణి విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో ప్రతిభ కనబరచడం అభినందనీయమని చెప్పారు.

ఖాదర్‌లింగస్వామి దర్గాకు పోటెత్తిన భక్తులు


ప్రత్యేక ఫాతెహాలు సమర్పిస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గా గురువారం భక్తులతో కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రాకతో దర్గా పరిసరాలు కిక్కిరిసి పోయాయి. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధంతో పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు.

నిరుద్యోగులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ఆలూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు నైపుణాభివృద్ధి శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా స్కిల్ అధికారి శ్రీకాంత్ రెడ్డి, ఆలూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్‌ప్రసాద్ తెలిపారు. వారు గురువారం మాట్లాడుతూ.. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 4వ తేదీలోపు స్థానిక కళాశాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అకౌంట్ ఎగ్జిక్యూటీవ్, (ట్యాలీ విత్ జీఎస్టీ), సీఎంఆర్ డొమెస్టిక్ నాన్ వాయిస్ (కంప్యూటర్ కోర్సు, ఐటీ సెక్టార్) విభాగంలో మూడు నెలల పాటు ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. వివరాలకు 90100 03132, 63002 30937 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ముగిసిన సిద్ధేశ్వర స్వామి ఉత్సవాలు

హొళగుంద: ఆంధ్రా, కర్ణాటక సరిహద్దు గ్రామాలతో పాటు మండల ప్రజల ఆరాధ్య దేవుడు సిద్ధేశ్వర స్వామి జాతర గురువారం వసంతోత్సవ కార్యక్రమంతో వైభవంగా ముగిసింది. గత 26న కంకణధారణతో ఉత్సవాలు ప్రారంభమైన సంగతి తెలిసిందే. అందులో భాగంగా 31న రథోత్సవం, ఈ నెల 1న లంకాదహనం ఘనంగా నిర్వహించారు. గురువారం వసంతోత్సవంలో భాగంగా ఆలయంలో సిద్ధేశ్వరునికి ఆకుపూజ, మహామంగళారతి, అభిషేక పూజలు చేపట్టారు. అనంతరం రాత్రి పల్లకిలో ఉత్సవ మూర్తులను ఉంచి ఊరేగింపుగా ఆలయ పూజారుల ఇంటికి చేర్చడంతో ఉత్సవాలు ముగిశాయి.

ప్రజల గుండెల్లో జగన్ స్థానం సుస్థిరం

- ప్రతిపక్షాలవి పసలేని ఆరోపణలు
- వాటిని నమ్మని జనం
- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి
- పెసలబండలో 'గడప గడపకు మన ప్రభుత్వం'


మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని రూరల్ : అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి వివిధ రకాల సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని, ప్రతిపక్షాలు ఎన్ని పసలేని ఆరోపణలు చేసినా వారు నమ్మడం లేదని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెసలబండ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు తిరిగి ప్రభుత్వం నుంచి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వస్తున్న సానుకూల స్పందన, ప్రజల గుండెల్లో జగన్ స్థానాన్ని వారు ఆనందంగా పంచుకుంటున్నతీరు అమోఘమన్నారు. మూడున్నర సంవత్సరాల పరిపాలనలో జగన్ ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం 95 శాతం పథకాలను అమలు చేసిన ఘనత దేశంలో ఏ ముఖ్యమంత్రికి దక్కలేదన్నారు. నవరత్నాలు పేదల జీవితాలను మార్చాయని, వారు ఇప్పుడిప్పుడే మెరుగైన స్థితిలోకి వస్తున్నారని, ఈ పథకాలు ఇలాగే కొనసాగితే త్వరలోనే వారు అభివృద్ధి చెందుతారని, అందుకోసం జగనన్నను మనమందరం మళ్లీ గెలిపించుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని చెప్పారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని స్థానికులకు సూచించారు. పారదర్శక పాలనలో దేశంలోనే మొదటి సారిగా అమలవుతోందని, పథకాల సొమ్ము పక్కదారి పట్టకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమచేయడం, పథకాల అమలుకు సిఫారులు, మధ్యవర్తుల విధానాన్ని పూర్తిగా మాఫీ చేసి గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను తీసుకొచ్చి నిజమైన అర్హులకు ఇంటి వద్దకే పథకాలు అందేలా చర్యలు చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కామాక్షి తిమ్మప్ప, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు రేణుక, మంజుల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగమల్లయ్య, పీఆర్ ఏఈ మాలిక్‌బాషా, ఆర్‌ఐ జయరామిరెడ్డి, ఏపీఓ చంద్రశేఖర్, నాయకురాళ్లు శ్రీలక్ష్మి, కల్పవల్లి, సర్పంచ్ నరసింహులు, శివారెడ్డి, వీరభద్రగౌడ్, మాజీ సర్పంచ్ నరసింహులు, రాముడు, విరుపాక్షి పాల్గొన్నారు.

నేటి నుంచి వార్షికోత్సవ వేడుకలు


పూజలందుకుంటున్న సిద్ధరూఢ స్వామి

కోసిగి: స్థానిక రైల్వే గేటు సమీపంలోనున్న సద్గురు ఆరూఢ జ్యోతి శాంతాశ్రమంలో వెలసిన సిద్ధరూఢ స్వామి ఆలయ సప్తమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నుంచి ఆదివారం వరకు నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ శుక్రవారం వేకువజామున స్వామి వారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, ఫలపుష్పాలంకరణ, వెండికవచ అలంకరణల అనంతరం ప్రత్యేక పూజలు చేసి ఆలయం ప్రాంగణంలో పీఠాధిపతులతో పూజలకు అంకుర్పారణ చేయిస్తామన్నారు. అలాగే మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు చేపట్టి పీఠాధిపతులతో ఉపన్యాసం కార్యక్రమం నిర్వహించనున్నారు. 5న మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని స్వామి వారి రథోత్సవం ఉంటుందని చెప్పారు.

చిన్నారి మృతిపై విచారణ


విచారణ చేస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని చిన్నారి చిన్నపిల్లల ఆస్పత్రిలో ఇటీవల 10 నెలల ఆడ శిశువు మృతి చెందిన ఘటనపై గురువారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతి విచారణ చేపట్టారు. చికిత్స వికటించి గత నెల 28వ తేదీన శిశువు మృతి చెందిందంటూ తల్లిదండ్రులు, యువజన, విద్యార్థి సంఘాలు ఆస్పత్రి ముందు ఆందోళనకు దిగిన విషయం విధితమే. దీనిపై జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కలెక్టర్, జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ గురువారం స్థానిక ఆస్పత్రిని తనిఖీ చేసి బాలిక తల్లిదండ్రులను విచారించారు. ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

అనుమతి లేని ల్యాబ్‌లపై చర్యలు తీసుకోండి

వైద్య శాఖ అనుమతుల్లేకుండా పట్టణంలో నిర్వహిస్తున్న డయాగ్నోస్టిక్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని చిన్నారి ఆస్పత్రిలో విచారణ జరిపేందుకు వచ్చిన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ సత్యవతికి వినతి పత్రం ఇచ్చారు.

ఉపాధ్యాయుడికి కన్నీటి వీడ్కోలు


శిలువయ్య(ఫైల్)

కోసిగి: స్థానిక సిద్దప్ప పాలెం ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న శిలువయ్య (44) అనే ఉపాధ్యాయుడు అనారోగ్యంతో బాధపడుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఆయన దాదాపు 20 ఏళ్లుగా స్థానిక మౌంట్ కార్మెల్ పాఠశాలలో ప్రైవేట్ ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నాడు. నెల రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతిలో వైద్య చికిత్స చేయించినా కోలుకోలేకపోయారు. విషయం తెలుసుకున్న పాఠశాల యాజమాన్యం విద్యార్థులతో కలిసి కరస్పాండెంట్ ఫాదర్ షిజో, ప్రిన్సిపాల్ జాన్సన్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.12 వేలు, స్నేహితులు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. మృతుడికి భార్య అమేజమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. అలాగే వైఎస్సార్ బీమా పథకం తక్షణ సాయంగా రూ.10వేలు అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ వీరేష్ మృతుడి భార్య అమేజమ్మకు అందించారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి ప్రక్రియ


ఇరుముడితో శ్రీశైలానికి వెళ్తున్న దృశ్యం

ఆదోని అర్బన్ : పట్టణంలోని ప్రభాకర్ టాకీసు పక్కనున్న శ్రీ శంభులింగేశ్వరస్వామి దేవాలయంలో శివమాల ధారులు గురువారం ఇరుముడి ప్రక్రియను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. ఈ మేరకు ఆలయంలోని గురుస్వామి శైలేంద్రనాథ్, ఆయనతో పాటు మరో ఇద్దరు ఇరుముడితో శ్రీశైలం బయలుదేరారు. ఆయన ఆధ్వర్యంలో జరగాల్సిన ఇరుముడి కార్యక్రమాలు ఈ వారంలో ప్రారంభమవుతున్నాయి. దీంతో గురుస్వామి ముందుగానే మల్లన్నకు ఇరుముడి సమర్పిస్తున్నారు. అలాగే మధ్యాహ్నం దాత హంపయ్యస్వామి మాలధారులకు అన్నదానం చేశారు.


కోలాటమాడుతున్న చిన్నారులు

ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

కోసిగి: మండలంలోని మూగలదొడ్డి గ్రామంలో గ్రామ దేవత దుర్గమ్మ దేవరను పురస్కరించుకుని గ్రామంలో యువతీ యువకులు నిర్వహించిన కోలాట ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. గ్రామీణ ప్రాంత జానద పదాలు, సినిమా డిజే పాటలకు చిన్నారుల కోలాటం అలరించింది. అలాగే రాత్రి నాటక ప్రదర్శన ఏర్పాటు చేశారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

స్పాట్ బిల్లింగ్‌పై దృష్టి సారించండి

కర్నూలు(రాజ్‌విహార్): నెలవారీ విద్యుత్ బిల్లులు తీసే స్పాట్ బిల్లింగ్ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి సూచించారు. గురువారం ఆయన కింది స్థాయి అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిల్లులు జారీ చేయడంలో ఎలాంటి సమస్య తలెత్తరాదని పేర్కొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి మీటర్‌ను డిజిటల్ యాప్ ద్వారా స్కాన్ చేసి రీడింగ్ చేయాలని చెప్పారు. డోర్ లాక్ బిల్లింగ్‌లో డోర్ లాక్ ఆప్షన్ ఉండేలా చూడాలని, మీటర్‌లో సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు సంబంధితన అధికారులు స్పందించాలన్నారు. బిల్లుల జారీ పూర్తయ్యాక బిల్లులు 100 శాతం రాబట్టాలన్నారు. దీనిపై ఆపరేషన్స్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్లు, ఏఈలు ప్రత్యేక ప్రణాళిక తయారు చేసుకొని లక్ష్యం చేరాలన్నారు. పాత బిల్లులు, మొండి బకాయిలను ఎలాగైనా రాబట్టాలని, ప్రభుత్వ శాఖలకు ఎప్పటికప్పుడు ఆయా అధికారులతో మాట్లాడి వసూలు అయ్యేలా చూడాలని సూచించారు. అంతరాయం, ఇతర సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించి పునరుద్ధరించాలని సూచించారు. ఫిర్యాదులు వచ్చిన వెంటనే సంఘటన స్థలానికి వెళ్లి పరిష్కారం చూపాలని, వీటిపై నిర్లక్ష్యం వహించడం తగదన్నారు.

24 ఏళ్ల తర్వాత తెప్పోత్సవానికి ఏర్పాట్లు

మద్దికెర: మండల కేంద్రంలోని మద్దమ్మ బావిలో 24 ఏళ్ల తర్వాత తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు గురువారం తెలిపారు. గతంలో వర్షాలకు మద్దమ్మకుంటలో నీరు వస్తేనే బావిలో సమృద్ధిగా నీరు ఉండేది. గత కొన్నేళ్లుగా బావిలో నీరు లేకపోవడంతో ఉత్సవాలు నిర్వహించలేదు. మూడేళ్ల క్రితం హంద్రీ-నీవా కాలువ నుంచి మద్దమ్మ కుంటకు పైపులైన్ ఏర్పాటు చేసి 24 గంటలు నీటిని పంపింగ్ చేస్తుండడంతో గ్రామంలోని బావులు, బోర్లులో భూగర్భ జలాలు పెరిగి నీటి సమస్య తీరింది. ప్రస్తుతం బావిలో నీరు సమృద్ధిగా ఉండడంతో ఆంజనేయ, శివాలయంలో కొలువైన స్వామి వార్ల తెప్పోత్సవం నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నో ఏళ్ల తర్వాత తెప్పోత్సవం నిర్వహిస్తుండడంతో ప్రజలు, భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్టెమి ప్రాజెక్టు అధ్యయానికి డాక్టర్ చంద్రశేఖర్

కర్నూలు(హాస్పిటల్): తమిళనాడులో గుండెపోటు మరణాలను తగ్గించేందుకు నిర్వహిస్తున్న స్టెమి ప్రాజెక్టును అధ్యయనం చేసేందుకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల కార్డియాలజి హెచ్‌వోడీ డాక్టర్ పి. చంద్రశేఖర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. ఆయనతో పాటు డాక్టర్ ఎస్. శ్రీకాంత్, స్పెషల్ ఆఫీసర్, డాక్టర్ మునీశ్వరరెడ్డి, వైజాగ్‌కు చెందిన కార్డియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ మల్లాది శ్రీనివాసరావు, వరల్డ్‌బ్యాంక్ ప్రాజెక్ట్ కన్సల్టెంట్ దేవరాజ్ ఈ బృందంలో ఉన్నారు. వీరు ఈ నెల 3, 4వ తేదిల్లో తమిళనాడు అధ్యయనం చేసి ప్రభుత్వానికి రిపోర్ట్ ఇవ్వనున్నారు.

భయం వీడి పరీక్షలకు సిద్ధం కావాలి

కృష్ణగిరి: విద్యార్థులు భయం వీడి పరీక్షలకు సిద్ధం కావాలని జీసీడీఓ సునీత సూచించారు. కృష్ణగిరిలోని కస్తూర్బా విద్యాలయాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. సీ, డీ గ్రేడుల్లో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పనిచేయాలని ఎస్‌ఓ సునీతకు సూచించారు. పరీక్షల సమయం దగ్గర పడుతుండటంతో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం భోజనశాలను పరిశీలించి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు.

సూర్యప్రభ వాహనంపై చెన్నకేశవ స్వామి



ఆలూరు: దేవనకొండ మండలం కప్పట్రాళ్ల ఫారెస్ట్‌లో కొలువుదీరిన కౌలుట్ల చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సమేత ఉత్సవ మూర్తిని సూర్యప్రభ వాహనంపై ఊరేగించారు. అంతకుముందు ధ్వజారోహన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో చేపట్టారు. రక్షబంధనం, ఆలయ సంప్రోక్షణ, కలశ స్థాపన, మండపారాధన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ హనుమంత రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేడు ఆలూరు ఎంపీపీ ఎన్నిక

ఆలూరు రూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం మండల అధ్యక్షురాలి ఎన్నిక పరోక్ష పద్ధతిలో నిర్వహించనున్నట్లు ఆలూరు మండల ఎన్నికల అధికారి శాంతన్న తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. ఆలూరు ఎంపీపీ బూర్ల సుభాషిణి (50) అనారోగ్యంతో గత ఆగస్టు 24వ తేదీన మృతి చెందడంతో ఆ స్థానం ఖాళీగా ఉంది. ఇందులో భాగంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎంపీపీ ఎన్నిక కోసం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలూరు ఎంపీపీ స్థానం ఎస్సీ మహిళకు (రిజర్వ్) ఉంది. ప్రస్తుతం మండలంలో కమ్మరచేడు గ్రామ ఎంపీటీసీ రంగమ్మ, ఎం.కొట్టాల ఎంపీటీసీ లలితమ్మ మండల అధ్యక్ష పదవికి అర్హులుగా ఉన్నారు. వీరిలో ఒకరిని మండల అధ్యక్షురాలిగా ఎంపీటీసీలు చేతులు ఎత్తి మద్దతు తెలిపే పద్ధతిలో ఎన్నుకుంటారని ఎన్నికల అధికారి చెప్పారు. మెజారిటీ కోరం (8 మంది) సభ్యుల నిర్ణయంతో ఏకగ్రీవం చేసుకోవచ్చని తెలిపారు. ఎంపీపీకి పోటీ చేసే వారు నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థిని బలపరిచేందుకు, ప్రతిపాదించేందుకు ఒక్కో ఎంపీటీసీ ఉండాలని వెల్లడించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 11 గంటలకు అన్ని స్థానాల ఎంపీటీసీలు హాజరుకావాలన్నారు.

5 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో మారెమ్మ, సుంకులమ్మవ్వల దేవర పురస్కరించుకొని ఈ నెల 5 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్లు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు రూ.600 ఎంట్రీ ఫీజు చెల్లించి 3వ తేదీలోపు జట్టు పేరు నమోదు చేసుకోవాలన్నారు. మొదటి బహుమతి రూ.20,016, రెండవ బహుమతిగా రూ.15,016 అందించనున్నట్లు చెప్పారు. వివరాలకు 93989 44628, 77993 73637 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎమ్మిగనూరులో 4న జాబ్‌మేళా

గోనెగండ్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ డీఆర్‌డీఏ వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఈ నెల 4న డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్, వీవర్స్ కాలనీ ఎమ్మిగనూరులో జాబ్ మేళా ఉంటుందని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జాబ్ మేళాలో పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాల భర్తీ కోసం అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, పీజీ, ఐటిఐ, డిప్లొమా, ఎంబీఏ, బీటెక్ చదివి 18 – 35 ఏళ్ల వయసు వారు అర్హులన్నారు.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి


మంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న దృశ్యం

మంత్రాలయం రూరల్: పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంత్రాలయం గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య పంచాయతీ రాజ్ శాఖ మంత్రి బూడి ముత్యాలనాయుడుకి వినతి పత్రం అందజేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సర్పంచ్‌ల సమావేశానికి మంత్రాలయం నియోజకవర్గ సర్పంచ్ ప్రతినిధిగా తెల్లబండ్ల భీమయ్య పాల్గొన్నారు. సమావేశానికి ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, మంత్రి బూడి ముత్యాలనాయుడు, లేళ్ల అప్పిరెడ్డి హాజరయ్యారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేసిన వారికి బిల్లులు, పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలు మంజూరు చేసి పలు గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరగా వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని భీమయ్య గురువారం తెలిపారు.

రాష్ట్రానికి మొండిచేయి చూపిన కేంద్రం


మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ఆదోని రూరల్ : కేంద్ర ఆర్థికశాఖ మంత్రి ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి మొండిచేయి చూపారని కాంగ్రెస్ పార్టీ ఆదోని నియోజకవర్గ బాధ్యులు నీలకంఠప్ప విమర్శించారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంపై మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు పూర్తి కనీసం కేటాయింపులు చేయకపోవడంపై బీజేపీ నిజరూపమేంటో తెలిసిపోయిందన్నారు. విశాఖ రైల్వే జోన్ అంశంపైన కనీసం ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. పార్టీ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ దిలీప్‌దోకా, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి మారుతిరావు, సహాయ కార్యదర్శి మద్దిలేటి, ఇర్ఫాన్, రాము పాల్గొన్నారు.

రైతుల వ్యతిరేక బడ్జెట్

కౌతాళం: కార్పొరేటర్లకు అనుకూలంగా రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రవేశపెట్టిన బడ్జెట్ ఉందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య విమర్శించారు. బడ్జెట్‌కు వ్యతిరేకంగా గురువారం రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో ఎన్నికలు ఉన్నందున వారికి అనుకూలంగా బడ్జెట్‌లో కేటాయింపులు జరిగాయని, మన రాష్ట్రాన్ని కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. రైతుల అభివృద్ధికి, ఇచ్చిన హామీలకు కేటాయింపులు చేయకపోవడం వారి చిత్తశుద్ధిని బయటపెట్టిందన్నారు. ఈ బడ్జెట్‌ను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సంఘం మండల కార్యదర్శి ఈరన్న, నాయకులు నాగరాజు, తిక్కయ్య వన్నూరప్ప, హనుమంతు, బసవ, వీరేష్, వలి పాల్గొన్నారు.


చెక్కు అందజేసి మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

పరిహారం అందజేత

ఆదోని రూరల్ : మండలంలోని ఆరేకల్ గ్రామానికి చెందిన గోవిందరెడ్డి గారి నాగిరెడ్డి అనే రైతు గతేడాది జూలై24న అప్పులబాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. ఇందులో భాగంగా గురువారం మృతుడి భార్య గోవిందరెడ్డి గారి జయలక్ష్మికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.7 లక్షల చెక్కును ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ క్షణికావేశంలో ఆత్మహత్య చేసుకుని కుటుంబాన్ని రోడ్డుపాలు చేయడం సరికాదని, రైతులు ఆలోచించాలని కోరారు.కార్యక్రమంలో వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు ఎం.గిరీష్, మండల వ్యవసాయ అధికారి పి.పాపిరెడ్డి, సర్పంచ్ లోహితప్రియ వీరస్వామి, నాయకులు రామలింగేశ్వరయాదవ్, తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

నేడు ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కార్యవర్గ సమావేశం

కర్నూలు కల్చరల్: ఏపీ జేఏసీ అమరావతి జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో జరుగుతుందని ఏపీ జేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ వి.గిరికుమార్ రెడ్డి తెలిపారు. ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లాలోని భాగస్వామ్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు అందరూ హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

మహిళలు జీవనోపాధి మెరుగుపరుచుకోవాలి

వెల్దుర్తి: ప్రభుత్వం అందించే పథకాలు, రుణాలను, సౌకర్యాలను ఉపయోగించుకుని మహిళలు జీవనోపాధి మెరుగుపరుచుకోవాలని డీఆర్‌డీఏ–వైకేపీ పీడీ వెంకటసుబ్బయ్య సూచించారు. గురువారం ఆయన స్థానిక రాణితోటలోని రాజరాజేశ్వర స్వామి (పశువుల) దేవాలయంలో ఏపీఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఇప్పటి వరకు వివిధ పథకాల ద్వారా లబ్ధి పొంది ఆర్థిక ప్రగతి సాధిస్తున్న మహిళల వివరాలు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. పీడీ మాట్లాడుతూ.. ప్రతి మహిళకు అదనపు ఆదాయం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఇందులో భాగంగా పెరటి కోళ్లు, గుడ్లు పెట్టే కోళ్లు, పొట్టేళ్ల పెంపకం, పాలిచ్చే గేదెలు, ఆవుల పోషణ, వస్త్ర, టైలరింగ్, కిరాణం తదితర దుకాణాల నిర్వహణకై యూనిట్లు అందిస్తున్నామన్నారు. ఆయా యూనిట్లు ఏర్పాటు చేసుకోదలచిన మహిళలకు వైఎస్సార్ చేయూత, జగనన్న తోడు, స్త్రీ నిధి, ఉన్నతి, వివిధ రకాల బ్యాంకు లింకేజీ పథకాల ద్వారా రుణాలందించడంతోపాటు, యూనిట్లు సరఫరా చేస్తామన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

కల్లూరు: వాతారవరణంలో మార్పులు సంభవిస్తున్నప్పుడు వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం కల్లూరు మండలం ఉలిందకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చలికాలంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు చలికాలంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్ల పక్కన ఉన్న ఆహారాన్ని, చిరుతిండ్లను, జంక్ ఫుడ్‌ను తీసుకుంటే అనారోగ్యానికి గురవుతారని హెచ్చరించారు. ఇంట్లో చేసిన ఆహారాన్ని తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని, వేడివేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉల్లిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఎంపీహెచ్‌ఈఓ సుబ్బారాయుడు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.